




# ఇప్పపూలు

బోయ జంగయ్య

అడవితల్లి ఒడిలో వాగులువంకలు. వాటి ఒడ్డున మంకీక్యాపుల్లాంటి వనవాసుల గుడిసెలు. వాటి ఎదురుగా ధాన్యం దాచుకునే గుమ్ములు. వాటికి మూడువైపులా పలువరుసలాగా రాళ్లు పేర్చిన గోడలు. వాటి ముందు చింతచెట్లు, వేపచెట్లు. పక్కమ్మటే పశువుల సన్నజీవాల దొడ్లు.

తండ నుంచి తండకు పిల్లబాటలు. చుట్టుపట్టు ఊళ్లకు ఎగుడుదిగుడు బండ్లబాటలు... దొడ్ల ముందు నెగళ్లు... కుక్కలు... అప్పుడప్పుడు దాడులు చేసే తోడేళ్లు, పులులు, చిరుతలు...

కొండవాగెమ్మట ఉన్న ఓ తండా పేరు ముండ్రాయి తండ.

అక్కడ ఉండే లంబాడీలు, చెంచులు కాయ కష్టం చేసుకుని కాలాన్నిబట్టి కొర్రలు, జొన్నలు, ధనియాలు పండిస్తుంటారు. ఆవులను బర్లెను సాదుకుంటూ పాలు నెయ్యిని అమ్ముతుంటారు.

ఈ తండా చుట్టూరా మోదుగు పొదలు, జాన చెట్లు వాటికి వేలాడే గురువింద తీగెలు. గురువిందలు ఎర్రగా ఉండి తలపై నల్లగా చూడముచ్చటగా వుంటాయి. మిగిలిన అడవంతా ఇప్పవనం. మత్తు వాసనలతో ఇప్పపూలు. వాటి చుట్టూ తిరిగే సీతాకోక చిలుకలు, తేనెటీగలు. చెట్లకింద రాలిన ఇప్పపూలు కుప్పలుకుప్పలు! వీటిని ఏరి బట్టీపెట్టి తీసేదే ఇప్పపూవు సారా.

ఇప్పపూవు సారా అంటే ప్రతి గిరిజనుడికీ ఇష్టం. కానీ సారా మీద ప్రభుత్వం నిషేధం విధించాక చాటుమాటుగా తయారుచేయక తప్పడంలేదు. పండించిన పంటలతోపాటు సారాను కూడా అమ్మితే తప్ప తినడానికి ఉప్పులు పప్పులు రావు. అప్పుడప్పుడు ఆప్కారి వాళ్లు దాడులు జరిపి శిక్షలు విధిస్తుంటారు. ఆ తర్వాత మళ్లీ మామూలు.

చలికాలం రోజులు... మంచు కురుస్తూ ఉంది. తండాలో బట్టీలు వదిలే పొగంతా మంచుతో కలిసిపోతూ ఉంది. ఆ దట్టమైన పొగమంచులో తండా లోపలికి జీపొచ్చి ఆగేవరకు ఎవరూ తెలుసుకోలేకపోయారు. ఆపూట కుక్కలు కూడా ముడుచుకుని పండుకుని జీపు రాగానే అటు పరుగెత్తినయి. ఎప్పుడూ రెప్పపాటులో సారా కాగులను కనపడకుండా చేసే వాళ్లు. ఈసారి కొందరు దొరికిపోయారు. సారాకాగులు పగిలినయి. ఎంతో నికార్సయిన సారా నేలపాలైంది. కాచినవాళ్ల ప్రాణం తల్లడిల్లింది. జనం ఉరుకులు పరుగులు. కొందరు తప్పించుకున్నారు. కొందరు పట్టుబడ్డారు. పట్టుబడ్డ వాళ్లలో ఎక్కువమంది రొక్కమిచ్చి తప్పించుకున్నారు.

దాడి జరిపారు కనుక కేసు ఒక్కటన్నా కావాలి. గుడిసెలన్నిటినీ వెతికారు. ఎలుకల పరుగులు తప్ప మరేం కనిపించలేదు. పక్కవైపున్న దొడ్ల పొదలు వెతికారు. అటుఇటు పరుగెత్తే తొండలు కనిపించాయి. వెతికేటప్పుడు ఆయా గుడిసెలకు సంబంధించిన ఆడవాళ్లు అడ్డుతగిలి బతిమిలాడి కొందరు కాగుల్ని కానరాకుండా చేశారు. సారాక్యానులు సాటుకు పోతున్నాయి. చివరికి ఓ ఇంటి వాళ్లను, వాళ్లు కాచిన సారాను జీపు ఎక్కించుకున్నారు.

జీపొచ్చి పోలీస్‌స్టేషన్ ముందాగింది. ఆప్కారి దారోగ, నలుగురు జవాన్లు దిగారు. వాళ్ల వెనకాల ఓ

నడీడు స్త్రీ, మరో ప్రౌఢ... ఆ వెనుకనే వాళ్ల భర్తలు దిగారు. వాళ్ల చేతుల్లో కుండ, లొట్టి చెరోవైపు ఉన్నాయి.

''జాగ్రత్త కుండ పగులగొట్టేవు,'' అన్నాడు జవాను.

''పగులగొట్టేదైతే ఎప్పుడో పగులగొడుదుం,'' లేసి కుండను పట్టుకుంటూ అన్నాడు భిక్య. ఆప్కారి జీపు రాకను చూసి ఓ పి.సి వెళ్లి, ''అసలిది ఏంది,'' అన్నాడు జవాన్‌తో.

''ఇదిగో,'' అంటూ ఓ కేన్ అందించాడు ఆప్కారి జవాను. వాటన్నిటినీ పట్టుకుని లంబాడీలు వరండా లోకి నడిచి, వాటిని అక్కడ ఉంచారు.

ఎస్.ఐ.తో కేసు వివరించి, ''వీళ్లకు తగిన శిక్ష వేయించాలి సారు. ఈ బద్మాషులు రెప్పపాటున సారాను, పెట్టిన బట్టీని కనిపించకుండా చేస్తా వుంటారు. వాళ్లకంటే వాళ్ల ఆడవాళ్లే హుషారు. మళ్లీ చూసే లోపల మాయం చేస్తారు,'' అని చెప్పి వెళ్లి జీపులో కూర్చున్నాడు.

అసలు సంగతేమిటంటే అత్త చూడకుండా కోడలిని తాకినప్పుడు 'పోనీ' అనుకుంది. రెండవసారి రొమ్మును తాకినప్పుడు గుడ్లురిమి చూసింది. ఆ చూపును దారోగ మనసులో ఉంచుకుని వాళ్ల మీద కేసు రాశాడు. ఆయన వెనకాలే జవానులు ఎక్కి కూర్చున్నారు. జీపు కదిలింది. అసలు కేసు సారా మీద కాదు. ధిక్కారపు చూపు మీద.

వాళ్లలోని అర్వై ఏళ్ల భిక్యను గుర్తుపట్టి, ''ఏయ్ ఎన్నిసార్లు చెప్పానురా బట్టీలు పెట్టవద్దని, వాని ముడ్డి మీద ఏసి సెల్ లేయర,'' అన్నాడు ఎస్.ఐ..

భిక్యను, కొడుకు భీమ్లాను రెండు అంటించి తండ్రి వెనక నడుస్తున్న కొడుకు వైపు చూస్తూ, ''అరే భీమ్లాగా దున్నలాగున్నావు కష్టం చేసుకుని బతకొచ్చుగ. దొంగసారా వ్యాపారం ఎందుకురా,'' అని పళ్లు పటపట కొరికాడు. ఈలోపు పి.సి లాఠీతో రెండేసి సెల్‌లో తోసి గేటేశాడు. రెండ్రోజులుంటే రోగం కుదురుతది.

ఎస్.ఐ. సెంట్రివైపు చూశాడు. సెంట్రి లంబాడ స్త్రీలతో ఏదో మాట్లాడుతూ ఉన్నాడు. వాళ్లు అతనికి దండం పెడుతూ ఏమేమో చెప్పుకుంటున్నారు. వాళ్ల బట్టల అద్దాలపై పడ్డ వెలుతురు కిరణాలు వరండా లోని గోడలకు ఫోకస్ అవుతున్నాయి.

''అరె వాళ్లు ఈరోజంతా ఇక్కడే ఉంటర్రా. తర్వాత మాట్లాడుకోవచ్చు. ఇటు పంపర,'' అన్నాడు ఎస్.ఐ. సెంట్రి వైపు చూస్తూ.

''పొండి. ఆ కుండ, క్యాను అన్నీ పట్టుకపోండి. లోపల బాగ ఏస్తడు,'' అన్నాడు సెంట్రి పోలీసుభాషలో. బిక్కుబిక్కుమంటూ మెట్లెక్కి వరండాలో నిలుచున్నారు కాళ్ల కడియాలు శబ్దం రాకుండా.

సెల్ గదుల ముందు సింహంలా కూర్చున్న ఎస్.ఐ., ''రాండ్రి రాండి,'' అంటూ వాళ్లవైపే చూస్తూ, ''అత్తా కోడండ్లానే,'' అని అడిగాడు కనుసొగల పైకి ఎత్తి వదులుతూ.

అవును అన్నట్టుగ ముసల్ది తలాడించింది.

'అచ్చుమైన సార తాగి రంగు తేలి వున్నరు. కోడలు కోడిపెట్టలాగుంది,' అనుకుంటూ ఓ వింత నవ్వు నవ్వాడు. ఇద్దరు దగ్గరికి వెళ్లి నిలుచున్నారు అమాయ కంగా.

''ఏమే... ఈ బట్టీలు పెట్టంది బతకరా? సార తాగి, పిట్టలను కుందేళ్లను తిని ఎట్లా బలిసిండ్రో!'' అంటూ కోడలిని ఎగాదిగా చూస్తా ఓసారి మీసాన్ని లాక్కున్నాడు. అత్త ఆ చూపులను భరించలేకపోతోంది. అప్పుడామె ఎదురుగా, తాకడానికి వస్తున్న ఏదు కొయ్యలు గుర్తొచ్చినయి. కోడలు తలవంచుకుని నిలుచుంది.

స్త్రీ తనను ఎవరు ఏ భావంతో చూసేది క్షణంలో తెలుసుకుంటుంది. కాసేపట్లో జరగబోయే ప్రమాదాన్ని పసిగడుతుంది.

''అరె రంగన్న ఈ ముసలిదాన్ని సెల్‌లో వేయర,'' అన్నాడు. రంగన్న అత్త వీపున లాఠీని ఉంచి సెల్‌లోకి నెట్టిండు.

''ఏమె నీ పేరేందె,'' అడిగాడు ఎస్.ఐ. అప్పు డతని చూపు కోతి తేనెపట్టును చూస్తున్నట్టుంది.

''లచ్చిమి దొర,'' అంది తలవంచుకునే అత్తను తనను వేరుచేసినందుకు భయంతో తల్లడిల్లుతూ. అప్పుడు ఎస్.ఐ. తలమీది క్యాపు పాముపడగలా కనిపించిందామెకు.

''రోజూ ఎంత సార తాగుతవె,'' అడిగాడు ఆమెను రెప్పకొట్టకుండా చూస్తూ.

''నేను తాగను దొర,'' అంది.

ఆ మాట అన్నప్పుడు ఆమె ముత్యాల్లాంటి పలు వరస మెరిసింది. నల్లని కనుసొగల కింది రెప్పలను తన్నుకొస్తున్న కనుగుడ్లు కదిలి, మనస్సులోని బాధను అదిమిపట్టిగ కదులుతున్న గోడలాంటి ముక్కు. కొంత సేపు ఎస్.ఐ. అలాగే చూస్తుండిపోయి, ''ఎవరె నీ ముఖానికి పచ్చబొట్లు పొడిపించింది. చంద్రునిలోని మచ్చల్లాగ,'' అన్నాడు.

అంతవరకు వెనక వేపచెట్టు కింద ఉన్న పక్క తండా సర్పంచ్, "నమస్కారం సార్," అంటూ వచ్చి నిలుచున్నాడు.

"అరే నిలుచున్నారేమి కూర్చోండి నాయక్‌గారు. ఈరోజు సర్పంచ్‌వి రేపు ఎంఎల్ఏవి కావచ్చు," అన్నాడు నవ్వుతూ కుర్చీని చూపిస్తూ.

"మీ నోటివాక్యం అట్లాగే కానీయండి," అన్నాడు సర్పంచ్ రమావత్ నాయక్.

సర్పంచ్ రాకతో లచ్చిమి కళ్ల నిండా నీళ్లూరుతూ ఉన్నాయి. పొయ్యి మీద పొంగే పాలగిన్నె మీది మూతను పక్కకు కదిలిస్తే పొంగు తగ్గి, మూతకు పట్టిన ఆవిరి ఒక అంచు నుంచి చుక్కలు చుక్కలుగా రాలినట్టు ఎదలో సుడులు తిరిగిన బాధను ఆమె కనురెప్పలు దుఃఖపు చుక్కలుగా రాల్చుతున్నాయి. అప్పటివరకు వణికించిన భయం కాస్త తగ్గినట్టు అనిపించింది. తలమీది నుంచి వేలాడిన దుప్పటితో ముక్కు అద్దుకుంది.

"నేను వెనక వేపచెట్టు కింద ఉన్నా. ఆప్కారి దారోగ పోతుపోతు ఈ విషయం చెప్పిపాయే. వీళ్లదీ మా పక్క తండే సార్. ఏదో తాగడానికి ఇంత కాసుకుంద్రేమో," అంటూ సెల్‌వైపు చూశాడు. తండ్రీకొడుకులు ఒకదానిలో ఉండగా అత్త వేరే దానిలో ఉంది. దేనికీ తాళం వేయలేదు.

తమ కులపు పెద్దమనిషిని చూడగానే కాస్త ధైర్యం వచ్చింది వాళ్లకు. వాళ్ల తండా చుట్టూ తండాల్లో ఏదైనా జగడమైనా, కొట్టుకున్నా ఈయనే సర్దిచెప్పతుంటాడు. స్టేషన్‌కు, కోర్టుకు రానీయడు. ఇదేమో సారా కేసాయె. సర్పంచ్ రమావత్ నాయక్‌కు ఎటు తోయడంలేదు.

ఎస్.ఐ. వైపు చూస్తూ, "ఈసారి వదలండి," అన్నాడు.

"సర్పంచ్‌గారు ఈ కేసును పట్టింది నేను కాదు. ఆప్కారి ఎస్.ఐ.గారు పట్టుకొచ్చారు. మీరు వాళ్లకు చెప్పండి. వాళ్లు సరే అంటే నేను వొదిలేస్తాను," అన్నాడు తేలికగా.

"నేను చెపుతూనే ఉంటా అయినా వీళ్లు వినరు. ఆ ముసలోడు, ముసల్ది మొదటినుంచి అలవాటుపడ్డ ప్రాణాలు. నిజాంకాలంలో కూడా గిరిజనులు సార కాచుకోవచ్చు. ఐదు శేర్ల సారా తమతో ఉంచుకోవచ్చు. ఆ తరువాత రామన్నకాలంలో కూడా అడివిలో ఉండే వాళ్ల అలుపుసొలుపును దృష్టిలో పెట్టుకుని వాళ్ల ఆచార వ్యవహారాలకు భంగం కలిగే ఏ చర్యనూ చేపట్టరాదన్నారు. ఈసారి ఇప్పచెట్లేమో ఆకులు కానరాకుండా పూసినయి," అన్నాడు నాయక్.

"పూస్తే సారా కాయాలనా," అడిగాడు ఎస్.ఐ..

"మరేం చేయమంటారు. లేకపోతే రాలి భూమికి బెత్తెడెత్తుకు పేరుకపోతాయి. చెట్టు మీదున్నప్పుడు పిట్టలు తింటాయి. తేనెటీగలు పీలుస్తాయి. ఈ పూల కాలంలో కోకిలలూ మత్తుగనే కూస్తాయి. అంతెందుకు ఎలుగుబంట్లు తిని మత్తుగ తిరుగుతూ మనుషులను నానాతిప్పలు పెడుతుంటాయి. ఓసారి ఏం జరిగిందంటే తెల్లారిజామున కదా ఇప్పపూవును ఏరేది. ఆవేళప్పుడు ఆడమగ వెళ్లి తలా కొన్ని చెట్లను ఎన్నుకొంటరు. అట్లా ఎన్నుకొని ఓ చెట్టు దగ్గరికి వెళ్లేసరికి అప్పటికే పూత తినడానికి వచ్చిన ఎలుగుబంటి మనిషి మీద పడి రక్కి చంపేసింది. అట్లాగే అడివి పందులు కూడా ఈ పూవు కోసం తారట్లాడుతుంటాయి. ప్రాణాలకు తెగించి వాటిని తరమలేక సావాలి. ఈ పూవును ఏరుకున్న తరువాత మీకు తెలుసు, మాకు తెలుసు. తమరే చూసి చూడనట్టు ఉండక తప్పదు. రాలిన పూలనే ఏరుకుంటాం. ఓ చెట్టును కొట్టేది లేదు, అడవిని పాడు చేసేది లేదు," అన్నాడు నాయక్ ప్రాధేయపూర్వకంగా.

"ఊర్కే పూవునంతా సేకరించి డిస్టిలరీలకు పంపితే పోలే," అన్నాడు.

నాయక్ నవ్వి, "ఇప్పటికే తేనెపట్టులు తీసుకెళ్లి పట్టణాలలో అమ్మిస్తున్నారు. ఇక ఈ పూలను పట్టుకెళితే వనవాసుల పనేంకాను?" అంగలార్చినట్టు అన్నాడు. అడవి సంపద గూడా అడవిలో ఉండే తమకు అందకుండా పోతున్నందుకు లోలోన బాధపడుతున్నప్పుడు దూడ పాలు తాగకుండా యజమాని మూతికి ముళ్లమూకుడు కట్టేది గుర్తొచ్చి.

"మీరంటే డబ్బున్నవాళ్లు. అందుబాటులో బ్రాందీ, విస్కీలు ఉంటాయి, కొనుక్కుంటరు. మరి మా పేదోళ్ల సంగతి," అన్నాడు మళ్లీ తానే నాయక్.

"చట్టం విషయంలో పేదలు, పెద్దలు ఇద్దరూ సమానమే."

"అయితే ఏరులై పారే గుడుంబాను ఆపగలుగుతున్నారా? వాటిని తయారుచేసే వాళ్లను పట్టుకోగలుగుతున్నారా? మేమే దొర్కినాం చట్టానికి," అంటూ నాయక్ అసహనంగా చూశాడు.

"వాళ్లనూ పట్టుకుంటున్నాం. మీ పెద్ద నాయకులు వదిలేయమంటే వదిలేస్తున్నాం. ఆ విషయం మీ

నాయకులను అడగాలి,'' అన్నాడు ఎస్.ఐ. తాపీగా నవ్వుతూ.

''అట్లయితే వీళ్లనూ వదిలేయండి,'' ఈసారి కొంచెం నవ్వుతూ అన్నాడు.

''ఇది ఆప్కారి వాళ్లు పెట్టిన కేసు. మేం కాదు,'' అన్నాడు ఎస్.ఐ..

''నేను వాళ్లతో మాట్లాడి వస్తాను. మీరూ దయ చూపండి. ఎండిన కర్రను, పండిన పండ్లను ఏరుకునే వాళ్లమే కాని పెద్దపెద్ద మీసాల వాళ్లలాగ గంధపుచెక్కలను, పెద్దపెద్ద అధికారుల్లాగ టేకుమాన్లను అమ్ముకోవటంలేదు. బంగ్లాల్లో, బారులల్లో ఫర్నీచరు కోసం దొంగరవాణా చేసేటోల్లం కాదు. కాకుంటే పొయిల పుల్లలు ఏరుకుంటోల్లం. చట్టాన్ని మా బక్క ప్రాణాల వైపు మళ్లించకండి. బడాచోరులకు బందాలు వేయండి,'' అన్నాడు నాయక్ ఆవేదనగా.

''చెపుతున్నాగా నా చేతిలో ఏమీలేదని,'' అన్నాడు.

''అయితే ఆప్కారి ఆఫీసుకు వెళ్లొస్తాను,'' అంటూ లేచి బయటికి నడిచాడు.

గంట గడిచిన తరువాత స్టేషన్‌లో ఫోను మోగింది.

''సర్ నేను ఆప్కారి ఎస్.ఐ.ని మాట్లాడుతున్న,'' అవతలి కంఠం.

''చెప్పండి.''

''సర్పంచ్‌గారు మరీమరీ చెపుతున్నారు. ఆయన సంగతి మీకు తెలుసుగా. బాగా పలుకుబడి ఉన్నాయన. గిరిజన మంత్రిగారి కుడిభుజం అని మీకూ తెలుసు,'' అన్నాడు.

''మీ ఇష్టం, మీరు వొదలమంటే వొదులుతాను.''

''వదలండి. నేనొచ్చి కాగితాలు వాపసు తీసుకుంటాను.''

''ఈ రాత్రి ఆ నెమిలిని...'' కింది పెదవిని కొరుకుతూ అన్నాడు.

''వద్దు వద్దు. కాలం బాగలేదు. తలనొప్పి తెచ్చుకోకండి. కావాలంటే ఎటన్నా వెళ్లొద్దాం. సాయంత్రం క్లబ్ వైపు రండి,'' అన్నాడు.

''సరే మీరోసారి రండి,'' అంటూ ఫోను పెట్టేశాడు.

'బతికిపోయినవే చిలుక,' అనుకుంటూ చూసిన చూపును గ్రహించి కంట్లో నలుసు పడ్డట్టు అనిపించగా అరచేత్తో అద్దుకుంది.

ఫోను పెట్టేసినప్పుడు పెన్‌స్టాండులోని పెన్ను కిందపడిపోయింది. 'ఇటివ్వు,' అన్నట్టు చూశాడు.

ఆమె కదలలేదు.

''ఆ పెన్ను ఇటివ్వు,'' అన్నాడు సూటిగా చూస్తూ.

పెన్ను అందుకునేటప్పుడు ఆమె వంగగా అప్పుడతనికి ఇప్పపూవు గుర్తొచ్చింది. అదీ పసుపురంగే! అందులోనూ మత్తు!

*

తెల్లతెల్లవారంగా ఉన్నట్టుండి తండా అంతా తల్లడిల్లిపోయింది. లచ్చిమి గొల్లుమని ఏడుస్తూ గుడిసె బయటికొచ్చింది. దొడ్డి ముందు మంట కాగుతున్న లచ్చినాయక్ ఇంకొంతమంది బిత్తరపోయి చూశారు. లచ్చిమి ఎద బాదుకుంటూ ఏడుస్తూనే ఉంది. అమ్మలక్కలు కూడి ఓదార్చుతూ విషయం అడిగారు.

''పక్కలోని చంటిది కనపడడంలేదు. ఓ బిడ్డో, నా బిడ్డో,'' అని నెత్తి బాదుకుంటూ ఉంది. మిగతా ఇద్దరు బిడ్డల ఏడుపుకు అంతులేదు. వాళ్ల ముక్కు నోళ్లు కూడా దుఃఖపు సొల్లును వదులుతున్నాయి. అది చూసి లచ్చినాయక్ ఏడుస్తూనే నిలుచోని వాళ్లను దగ్గరికి తీసుకొని శూన్యంలోకి చూస్తున్నాడు.

''ఆ ఎలుగొడ్డు పనె అయ్యుంటుంది,'' అన్నాడు ఏడుపును ఆపుకుంటూ.

''కావచ్చు ఆమధ్య పక్క తండాలో ఇదే జరిగింది. ఆడుకునే పిల్లను అందుకుపోయింది,'' అన్నది ఓ వృద్ధ స్త్రీ.

అందరు వచ్చి అదోటి ఇదోటి చెప్పి అంగలార్చిపోతూ ఉన్నారు. లచ్చినాయక్ మోకాళ్ల మీద తలానించి ఏడుస్తూ ఇంటి ముందటి చింతచెట్టు కింద కూర్చున్నాడు. నలుగురు నాలుగు రకాలుగా అంటూ ఉంటే వింటూ ఉన్నాడు. అతని ఆలోచనలు వెనక్కు వెళ్లాయి. మగబిడ్డ కోసం ఎదురు చూడగ వరుసగా ముగ్గురు ఆడపిల్లలే కలిగారు. వాళ్లను పెంచడమే కష్టం అయింది. ఇక వాళ్ల పెళ్లిళ్ల సంగతి చెప్పనక్కరలేదు. పెద్దది పెళ్లీడుకొచ్చింది. అది కదిలితే కొంత నయం అనుకున్నాడు. పేదోనికి పేద సంబంధమే కుదురుతది. అట్లాగే జరిగింది. పదిరోజుల్లో పెద్దబిడ్డ పెండ్లి.

*

తండల మధ్య ఏటిపక్కన పెద్ద భవన నిర్మాణం జరిగిపోయింది. ఆ పని జరిగినన్ని రోజులు రోజూ తండావాసులకు కూలిపని దొరికింది. కొన్నిరోజులు దొర్కిన కూలి ఎల్లకాలం నోట్లో మన్నుకొట్టే సంగతి

అప్పుడాళ్లకు తోచలేదు. అక్కడ నిర్మించింది ఓ పెద్ద డిస్టిలరీ. ఇక నుంచి పూచే ఇప్పపూవంతా అక్కడికి చేర్చాలి. ఆ ఫ్యాక్టరీలో ఆ పూవుతో మంచి వైన్ తయారవుతుంది. దానిని అక్కడ సీసాల్లో నింపి పట్టణాలకు పంపుతారు. ఇకపైన వనవాసులకు మిగిలింది మట్టి వాసనే! ఎందుకంటే వాళ్లే రోజూ ఆ రాలినపూవును ఏరి ఫ్యాక్టరీకి చేరవేసేది.

*

ఓరోజు అత్తగారి ఇంటి నుంచి పెద్దబిడ్డను పండుగకు తీసుకొస్తూ ఉన్నాడు లచ్చినాయక్.

ఎదురుగా కొండల మధ్యల నుంచి సూర్యుడు పైకి ఎక్కి వస్తున్నాడు. ఆ లేత ఎండకు పక్షులు రెక్కలాడిస్తూ ఎగురుతున్నాయి.

తోవ పక్కమ్మట ఉన్న సెలిమలోని నీళ్లను తాగుతూ ఉన్న ఎలుగుబంటిని చూసిన బిడ్డ, ''అయ్యా,'' అని ఆగి, దానివైపు వేలు చూపించి, ''అగ్గో చెల్లెను ఎత్తకపోయిన ఎలుగ్గొడ్డు,'' అంది.

లచ్చినాయక్ క్షణం ఆగి చూసి, దాని కంటపడకుండా చెట్లచాటుగా వేగంగా నడిచి దాటిపోయాడు. చెల్లెను ఎత్తుకపోయినప్పుడు తల్లి ఏడిచిన ఏడుపు గుర్తొచ్చి కళ్లనీళ్లు పెట్టుకుంటూ నడుస్తుంది తండ్రి వెనకాల పెద్దబిడ్డ. పెద్దబిడ్డ గుర్తు చేయడంతో చిన్నబిడ్డ కళ్లల్లో మెదిలింది. ఆ బిడ్డను తాను ఎట్లా అమ్మింది కళ్లల్లో కదిలింది.

ఒక్కసారే లచ్చినాయక్ గుండె కరిగి, కన్నీరుగా మారగా, కళ్లు మసకగా మారి నడిచే తోవ కనిపించక పోగా తన బిడ్డను ముందు నడవమని కాసేపు మౌనంగా నిలుచుండిపోయాడు.

*

ఆ రాత్రి లచ్చినాయక్ గుండెరాయి చేసుకుని చీకట్లో రోడ్లవైపు నడుస్తూ ఉన్నాడు. తండ్రి భుజం మీద తలానించి నింపాదిగా నిద్రపోతున్నది సంవత్సరపు పాప. పాలు, పసుపు కలిపిన బంగారు రంగు. నల్లని కనుసోగలు. చక్కని ముక్కు. ముద్దొచ్చే రూపం. పాలు సరిగా దొరకకనేమో చిక్కిపోయింది. లచ్చినాయక్ రాకను చూసిన కారు డోర్ తెరుచుకుంది. పాపను అందులో ఉన్న వ్యక్తికి అందించాడు.

అదనంగా మరో పది రూపాయల కట్టను అందించి, ''వీటిని కూడా ఉంచు నాయక్. ఈ విషయం ఎవరికీ తెలియవద్దు. నీ పెళ్లాం అరిచి అడావుడి చేస్తే విషయం అందరికీ తెలిసిపోతుంది. పత్రికల వాళ్లు రాస్తారు. పోలీసులు రంగంలోకి వస్తారు. అప్పుడు నీవు, నేను జైలుపాలు,'' అన్నాడు కారులోని వ్యక్తి డోర్ వేసుకుంటూ.

కారు కదిలింది. సరిగ్గా అప్పుడే ఓ పాము ఎలుకను నోట్ల కరుచుకుని వేగంగా రోడ్డుకు అడ్డంగా పరుగెత్తేది చూసి డ్రైవర్ కారును కాస్త స్లో చేశాడు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 1 ఫిబ్రవరి 2004*

